నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
సోమవారం | 19 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

పట్టించుకునేదెవరు..?

- వృథావుతున్న తాగునీరు
- ట్యాంక్ నిండి పారుతున్న వైనం..



నవతెలంగాణ-చిన్నకోడూరు
మండలంలోని మెట్టుబండల వద్ద నిర్మించిన వాటర్ ట్యాంక్ నిండి నీరంతా ఆదివారం వృథాగా పారింది. ఇంత జరిగినా సంబంధిత అధికారులు, ఉద్యోగులు అటు వైపు దృష్టి సారించ లేదు. దాంతో ట్యాంక్ నిండిపోయి నీరు నేలపై పారుతూ బురద మయంగా మారింది. సంబంధిత అధికారులు ప్రత్యేక చోరవ చూపి నీరు వృథాను అరికట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

వివాహానికి హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు
నంగునూరు మండలానికి చెందిన రాంపూర్ ఎంపీటీసీ ఎనగందుల నితిన్ కుమార్-సౌమ్య వివాహానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజర య్యారు. ఆదివారం సిద్దిపేట బైరి అంజయ్య గార్డెన్‌లో జరిగిన వివాహానికి హాజరై వధూవ రులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాక్రిష్ణ శర్మ జెడ్పీటీసీ తడిసిన ఉమా, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, పర్శరాములు గౌడ్, కాంట్రాక్టర్ ఎనగందుల జయలక్ష్మీ -యాదగిరి, నంగునూరు మండలానికి చెందిన తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు హాజరయ్యారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

నవతెలంగాణ-టేక్మాల్
మండలంలోని ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపనలు చేశారు. ముందుగా టేక్మాల్లో సీసీరోడ్డు పనులకు, పోగుల వెంకటాపూర్‌లో బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే టేక్మాల్ మోడల్ స్కూల్ అభివృద్ధి పనులకు, టేక్మాల్ కేజీబీవీ స్కూల్ అభివృద్ధి పనులకు, ఎల్లంపల్లి నుండి ఎల్లంపల్లితాండా వరకు బీటీరోడ్డు పనులకు, కడిలాబాయి తండా నుంచి హెచ్‌ఎంపల్లితాండా వరకు బీటీ రోడ్డు పనులకు, చంద్రుతాండా నుంచి వసురాం తండా వరకు బీటీరోడ్డు పనులకు, కేవ్లాతండాకు బీటీరోడ్డు పనులకు, షాబాద్‌తాండా వరకు రోడ్డు నిర్మాణ పనులకు, ఎల్లుపేట్ నుంచి దండువానికుంట వరకు బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా ఎల్లుపెట్‌లో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు భూమి పూజ చేశారు.



దుర్గమ్మ ఆలయంలో జెడ్పీటీసీ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మద్దూరు
మండలంలోని ధర్మారం గ్రామంలో దుర్గమ్మ ఆలయంలో మద్దూరు జెడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ జిల్లా అధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్, ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుందరగిరి సత్యనారాయణ గౌడ్, నాయకులు దాసరి పద్మా రెడ్డి, గుండెగోని మల్లేశం, పుల్లూరి రాజు, బొంగరం శేఖర్ రెడ్డి, నీరటి కిషోర్ పాల్గొన్నారు

ఛలో సెక్రటేరియట్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్
ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిడిఎన్ఎస్ రాష్ట్ర గౌరవ సలహాదారు శేషం శ్రీనివాస చార్యులు అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు శేషం శ్రీనివాస చార్యులు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదిన నిర్వహిస్తున్న ఛలో సెక్రటేరియట్ కార్యక్రమానికి అర్చకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డిడిఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. దూపదీప నైవేద్య అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్తగా నియామకం అయిన అర్చకులకు, గతంలో నియామకమైన అర్చకులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎస్ఐని కలిసిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-మర్కుక్
మర్కుక్ నూతన ఎస్ఐగా చల్లా మధుకర్ రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఆదివారం మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములు గౌడ్ ఎస్ఐ మధుకర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువతో సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగల్ మీసాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి కనకయ్య, నాయకులు సుదర్శన్ గౌడ్, రాముగౌడ్, లింగని నాగరాజు తదితరులున్నారు.



నేడు శివాజీ విగ్రహ పున ప్రతిష్ట శోభయాత్ర

నవతెలంగాణ-సిద్దిపేట
నేటి చత్రపతి శివాజీ విగ్రహ పునప్రతిష్ఠ శోభయాత్రలో హిందువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వజ్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తకొండ రాజు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య స్థాపన కొరకు ఎన్నో యుద్ధాలు చేసి, తన జీవితాన్ని త్యాగం చేసిన మహావీరుడు చక్రవర్తి చత్రపతి శివాజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పూతే... ఆశల పంట



- తీపి పంటపై చేదు వాతావరణం ఎఫెక్ట్
- కొన్నిచోట్ల విరగబూత.. ఇంకొన్ని చోట్ల రాని పూత
- రాత్రి వేళ చల్లదనం మేలు.. అతి మంచు నష్టం
- ఉమ్మడి జిల్లాలో 30 వేల ఎకరాల్లో మామిడి సాగు

పూతే అన్నదాతకు ఆశల పంట. అట్లాంటి మామిడి రైతుకు వాతారణ రంది పట్టుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో తీపి పంటపై చేదు వాతావరణం ఎఫెక్ట్ కనిపిస్తుంది. తోటలు పూతకొస్తున్న వేళ రాత్రి వేళ చల్లదనం మేలు చేస్తుండగా... అతి మంచు నష్టం చేస్తోంది. తోట ఏపుగా పూత పూయాలి. అది పిందెగా మారి కాయ కాయాలి. దిగుబడి చేతికొచ్చేదాక వాతావరణం అనుకూలించాలి. అందుకే ఇతర పంటల కంటే మామిడి పంట భిన్నమైనదిగా చెబుతారు. నవంబర్, డిసెంబర్ మాసాల్లోనే మామిడి తోటలు పూతతో నిండిపోవాలి. కానీ..! సంక్రాంతి తర్వాత పూత కనిపిస్తుంది. మామిడి సీజన్ వచ్చిదంటే చెట్లు విరగ పూస్తాయి. ఈసారి సస్య రక్షణ చర్యలు చేపట్టినా పూత అంతంత మాత్రమే కనిపిస్తుందని రైతులు పేర్కొంటున్నారు. అననుకూల వాతావరణం వల్ల పూత సరిగ్గా రాకపోయే సరికి మామిడి వ్యాపారులు తోటలను కొనుగోలు చేయడానికీ వెనుకాడుతున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 30 వేల ఎకరాల వరకు మామిడి తోటలు సాగయ్యాయి. వీటిలో పది వేల ఎకరాల వరకు వరకు మూడేళ్లలోపు తోటలున్నాయి. 20 వేల ఎకరాల వరకు కాత కాసే తోటలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 13200 ఎకరాల్లో సిద్దిపేట జిల్లాలో 13 వేల ఎకరాల్లో మెదక్ జిల్లాలో 4 వేల ఎకరాల వరకు మామిడి తోటలు సాగయ్యాయి. అత్యధికంగా వరి, పత్తి పంట సాగయ్యే ఉమ్మడి మెదక్ జిల్లాలో వాణిజ్య పంటలైన పండ్ల తోటల సాగు క్రమంగా పెరుగుతుంది. హైదరాబాద్ మార్కెట్ అనువుగా ఉన్నందున మామిడి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. బంగినపల్లి, దసేరి, చెరుకురసాలు, తోతాపరి ఇతర అనేక రకాల మామిడి తోటలున్నాయి. ఏ పంటైనా ఆర్నెళ్లు నాలుగు నెళ్లకో దిగుబడి వస్తాయి. మామిడి మాత్రం ఏడాదిలో ఒక సారే దిగుబడి వస్తుంది. అది చేతికొస్తే తప్ప మామిడి రైతులు ఆ ఏడాదంతా నష్టమే చవిచూడాల్సి వస్తది.

పూతపైనే ఆశలు..
మామిడి తోటలు నవంబర్, డిసెంబర్ మాసాల్లోనే పూతకొస్తాయి. ఈ ఏడాది మాత్రం ఆలస్యంగా తోటలు పూతకొచ్చాయి. సంక్రాంతి తర్వాత మామిడి చెట్లు పూత పూశాయి. వాతావరణం అనుకూలించిన చోట మామిడి చెట్లు విరగ పూశాయి. అననుకూల వాతరణం వల్ల కొన్ని చోట్ల పూత ఆలస్యంగా రావడమే కాకుండా వచ్చిన పూత కూడా నిలువక రాలిపోతున్న పరిస్థితులున్నాయి. ఈ ఏడాది మామిడి తోటల పరిస్థితి అంతుచిక్కట్లేదని మామిడి వ్యాపారులు పేర్కొంటున్నారు. వాతావరణ మార్పుల వల్ల మామిడి తోటలపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. రోజుల తరబడి మబ్బులు పట్టి, పొగమంచు కమ్ముకుంటుండడం వల్ల చీడపీడల దాడి ఉధృతం అవతుంది. పూత దశలో ఎంత చలి ఎక్కువగా ఉంటే అంత ఎక్కువ పూత వచ్చే అవకాశముంది. అలాంటి వాతావరణం ఉన్న రోజుల్లో పూత బాగా పూసింది. కొన్ని రోజులు ఎండల తీవ్రత పెరిగే సరికి పూత విషయంతో తేడాలు కనిపించాయని రైతులు పేర్కొం టున్నారు. రాత్రిపూట 15 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే పూతకు అనుకూలం అవుతుంది. రాత్రి వేళ చల్లదనం ఉండి పగటి పూట చెట్లకు తడి కట్టడం తగ్గిస్తే పూతకు అనుకూలత ఏర్పడుతుందని ఉద్యానవన అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిశ్రమ వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నం దున కొన్ని చెట్లు విరగ పూస్తున్నాయి. ఇంకొన్న చోట్ల మాత్రం పూత సరిగ్గా రాకపోవడంతో పొగమంచు వల్ల వచి ్చన పూత రాలిపోతుంది. చీడపీడలు ఆశించడం వల్ల కూడా పూత నిల్వని పరిస్థితులున్నాయి.

సస్యరక్షణ చర్యల భారం..
మామిడి పూతలో ప్రతి పూల గుత్తిలో 4 నుంచి 6 వేల పూలు ఉంటాయి. ఇవన్నీ మగపూలే. ఇందులో 1-3 పూలే కాయగా వృద్ధి చెందుతాయి. పూత సంరక్షణలో వాతావరణ పరిస్థితులు, నీటి, పోషక యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల బెడద, హార్మోన్ల లోపం వంటి విషయాల్లో రైతులు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. మిడి తోటల్లో చీడపీడల నివారణ కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వాతావరణ మార్పుల వల్ల ఆశించే చీడపీడల నివారణ కోసం అనేక రకాల పురుగుమందుల్ని స్ప్రే చేయాలి. యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. పూత బటానీ గింజ సైజు వచ్చేదాక మందుల్ని స్ప్రే చేయాలని సూచిస్తున్నారు. దీంతో రైతులపై పెట్టుబడుల భారం పడుతుంది. పూత రాని చెట్లపై మల్టీ కే 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాల్సి వస్తుంది. బోరాన్ లోపం ఉన్న తోటల్లో బోరాక్స్ 2 గ్రాముల చొప్పున లీటర్ నీటిలో కలిపి కొట్టాలి. పూత సమయంలో తేనే మంచు పురుగు, తామర పురుగు, ఆకుచుట్టు, పూత చుట్టు చేరి పిండి నల్లి పురుగులు నష్టం చేస్తాయి. వీటి నివారణ కోసం మందుల్ని వాడాలి.

జహీరాబాద్‌లో దొంగల బీభత్సం

- ఒకేరాత్రి ఆరు చోట్ల దొంగతనానికి యత్నం
- రూ.18 వేల నగదు అపహరణ
- సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు







నవతెలంగాణ-జహీరాబాద్
జహీరాబాద్ పట్టణంలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకేరాత్రి ఆరు చోట్ల దొంగతనానికి ప్రయత్నించి హల్చల్ చేశారు. ఒక్కరోజే ఆరు చోట్ల దొంగతనాలు జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. జహీరాబాద్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..
జహీరాబాద్ పట్టణంలోని ప్రఖ్యాతిగాంచిన రెండు బట్టల దుకాణాల్లో, పాత చెక్‌పోస్ట్ వద్ద గల రెండు వైన్ షాపుల్లో, పట్టణ నడిబొడ్డులోని ఒక కిరాణా దుకాణంతో పాటు జర్నలిస్టు కాలనీలోని రెండు గృహాల తాళాలు పగల కొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఘటనల్లో రూ.18,000 నగదును అపహరించుకపోయారు. కాగా దొంగతనానికి సంబంధించిన సంఘటనలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వాటి ఆధారంగా రెండు బృందాలను ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించామని.. త్వరలోనే నిందితులను పటుకుంటామని ఎస్ఐ తెలిపారు. పట్టణ ప్రజలు ఎవరూ కూడా భయాందోళన గురికావాల్సిన అవసరం లేదన్నారు. పగటిపూట వార్డుల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే.. వారి వివరాలను పోలీసులకు తెలపాలన్నారు. ఇండ్లు అద్దెకు ఇచ్చే ముందు వారి ఆధార్‌కార్డు వివరాలన్నింటినీ సేకరించి.. అనంతరమే నూతన వ్యక్తులకు ఇండ్లు అద్దెకు ఇవ్వాలన్నారు. ఆయా దుకాణాల యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



రాజ్యాంగ స్ఫూర్తి నెరవేరాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందే



నవతెలంగాణ-గజ్వేల్
గత ఏడు దశాబ్దాలుగా దళితుల మధ్య పేరుకుపోయిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలనే చీకటిని తొలగించే అఖండ దీపమే ఎస్సీ వర్గీకరణ అని.. రాజ్యాంగ స్ఫూర్తి నెరవేరాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందేనని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు మాదిగ, జిల్లా అధ్యక్షులు పెర్క పర్శరాములు అన్నారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ హరిత హోటల్‌లో ఆదివారం గజ్వేల్ మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జి ఉబ్బేని ఆంజనేయులు మాదిగ అధ్యక్షతన నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డా.బి.ఆర్ అంబేద్కర్ పవిత్రమైన లక్ష్యంతో రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరిస్తే, ఆ రిజర్వేషన్లు స్వతంత్ర భారతదేశంలో అన్ని కులాలు అందలేదన్నారు. పాలకులు జనాభా ప్రాతిపదికన ఎస్సీల లోని అన్ని కులాలకు రిజర్వేషన్లు అందించడంలో విఫలమయ్యారన్నారు. అందుకే రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఏడు దశాబ్దాలైన నేటికీ అంబేద్కర్ ఆశయం నెరవేరలేదన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి ఆ ఫలాలు అన్ని కులాలకు అందించాలనే లక్ష్యంతోనే మందకృష్ణ మాదిగ నేతృత్వంలో పోరాటం చేస్తున్నారన్నారు. ఈ పోరాటం ఏ కులానికి వ్యతిరేకం కాదన్నారు. రాజ్యాంగం సమానత్వం కోరుతుందని అది సాధ్యం కావాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలన్నారు. అందుకోసం జరుగుతున్న పోరాటంలో పాల్గొనడం ప్రతీ మాదిగ విద్యార్థి బాధ్యత అన్నారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అం శం చివరి దశలో ఉందని, మాదిగ ఉప కులాల ప్రజలు అప్రమత్తంగా ఉండి జాతి లక్ష్యం నెరవేరెంత వరకు ఉద్య మంలో ముందుకు సాగాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు, అన్ని కులాల ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి గజ్వేల్ సీనియర్ నేత పిన్నింటి శ్రీహరి సింధు, ఉబ్బానీ ఆంజనేయులు, రవీందర్, రమేష్, బొంది స్వామి,రాజు,ప్రశాంత్, కర్ణకర్, రాజు, శ్రీకాంత్, కర్ణకర్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్సోర్సింగ్ స్టాఫ్‌నర్స్‌లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట స్టాఫ్‌నర్స్‌లతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్
ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్డర్స్ లేకుండా.. అకాంఠంగా తొలగించిన ప్రభుత్వ హాస్పిటల్ ఔట్సోర్సింగ్ స్టాఫ్ నర్సులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్ వద్ద ఔట్సోర్సింగ్ స్టాఫ్ నర్సులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాముని గోపాల స్వామి మాట్లాడుతూ.. 2019 కరోనా సమయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు ఏజెన్సీ ద్వారా ఔట్సోర్సింగ్ పద్ధతిలో 80 మందిని రిక్రూట్మెంట్ చేసుకున్నారని.. అప్పుడు వారిని పర్మినెంట్ చేస్తామని హామీ కూడా ఇచ్చారన్నారు. కానీ గత ప్రభుత్వం ప్రభుత్వ హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ వేసి ఎగ్జామ్ నిర్వహించగా.. తర్వాత కొత్తగా వచ్చిన ప్రభుత్వం రిజల్ట్ ప్రకటించి మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. అయితే కరోనాకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించిన ఔట్సోర్సింగ్ స్టాఫ్ నర్సలను రెగ్యులరైజ్ చేయకపోగా.. వారిని విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఆర్డర్ కాపీ ఇవ్వకుండా వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామంటూ వ్యక్తిగత ఫోన్లకి స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ మెస్సెజ్‌లు పంపించాడన్నారు. ప్రభుత్వం ప్రకటన గానీ, ఆర్డర్ గానీ ఇవ్వకుండా సూపరింటెండెంట్ మెస్సెలు పంపడం ఏంటని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రకటన ఇచ్చేంతవరకు ఆర్డర్ ఇష్యూ చేసేంతవరకు.. వారినే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, స్టాఫ్ నర్స్ సిబ్బంది సంపత్, తార, గీత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి టీచర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్
అంగన్వాడి టీచర్లకు, హెల్పర్లకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శివ్వంపేట మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం మెదక్ జిల్లాలో నాలుగు ప్రాజెక్టుల పరిధిలో సుమారుగా 1076 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని వీటిలో మినీ ఆగన్వాడీ సెంటర్‌లు 119 ఉండగా, ఇందులో 1050 పైగా టీచర్లు,1008 హెల్పర్స్ పని చేస్తున్నారని తెలిపారు. వీరికి మూడు నెలలుగా వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని సమ్మె కాలపు వేతనాలతో పాటు పెండింగులో ఉన్న జీతాలు చెల్లించాలన్నారు. జీతాలు రాక అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. టీచర్లపై పని భారాన్ని తగ్గించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఈ మధ్య కాలంలో అంగన్వాడీ టీచర్లపై అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కొంతమంది అధికారులు అంగన్వాడీ టీచర్లపై అతి ఉత్సాహం చూపిస్తున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు వేధింపులు ఆపకపోతే సిఐటియూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామనిమహేందర్‌రెడ్డి హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
సోమవారం | 19 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

జిన్నారంలో ఎక్సలెన్స్ ఎంట్రన్స్ టెస్ట్

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో గల గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఆదివారం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు 173 మంది విద్యార్థులకు గాను బాలికలు 75 మంది, బాలురు 94 మంది మొత్తంగా 169 మంది విద్యార్థులు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షను ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి బృందం పర్యవేక్షించింది.



నూతన గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

వెంకటాపూర్ కిషన్‌నాయక్‌తాండా మాజీ సర్పంచ్ పారిభాయ్ సంగ్రామ్ నాయక్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బక్షారామ్, తాలూకా కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్గొండ, బీఆర్ఎస్ నారాయణఖేడ్ మండల యువత అధ్యక్షులు మాచందర్, బూరుగపల్లి సాయిలు, సంతగొండ కురుమ తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్కల్ పీర్ గైబ్ సాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవాలు మూడ్రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. మూడోరోజైన ఆదివారం పశువులో సంతలో భాగంగా వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పశువులను ఉర్సు ఉత్సవాల్లోని సంతకు తోలుకువచ్చారు. దాంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. అందంగా అలంకరించిన పశువులతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. కాగా ఎంతో పవిత్రమైన దర్గా ప్రాంతంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తుండడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం అమ్మకాలపై నియంత్రణ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జాతరలో ప్రముఖులు..

ఈ దర్గా ఉత్సవాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్, తన్వీర్‌లు పాల్గొని.. ఉత్సవ కమిటీతో కలిసి దర్గాలో ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా ప్రాంతంలో జరిగిన పశువుల సంతలో ఉత్తమమైన పశువులకు బహుమతులను వారి చేతుల మీదుగా అందజేశారు. వారి వెంట యూనుస్ ఖాన్, ప్రకాష్,బసవరాజ్, సత్యనారాయణ తదితరులున్నారు.



దళితులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలి
- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పి.అశోక్

నవతెలంగాణ-సంగారెడ్డి

దళితులపై దాడి చేసిన మతోన్మాద గూండాలను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పి.అశోక్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన కేవీపీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలోని దళితబస్తీలో సర్పంచ్ భర్త.. బస్తి వాసులకు ఇబ్బంది కలిగించేలా సీసీరోడ్డు వేస్తున్నందున పునః పరిశీలించాలని దళితులు అడిగారన్నారు. అంతమాత్రానికే గ్రామంలోని మతోన్మాద గూండాలతో కలిసి కట్టెలు, ఇనుప రాడ్లతో తీవ్ర గాయాలయ్యేలా దళితులపై దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే దళితులు చేసిన నేరమా అని ప్రశ్నించారు. ఈ ఘటనలో బాధ్యులైన మతోన్మాద గుండాలను కఠినంగా శిక్షించాలని.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో గాయపడిన దళితులకు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలన్నారు. పోలీసులు మతోన్మాద గుండాలకు తలొగ్గి దళితులపైన కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. దళితుల పైన పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి శివకుమార్, మహేష్ కుమార్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : జన్వాడ గ్రామంలో దళితుల రహదారి విషయంలో అగ్గిరాజేసిన మతోన్మాదులు ఒక పథకం ప్రకారం దళితులపైకి బీసీలను ఉసిగొల్పి దాడి చేసి గాయపరిచారని.. తక్షణమే పెత్తందారులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోటారి నర్సింలు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్వాడ గ్రామంలో గత కొంతకాలంగా బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ బీసీల్లో హిందుత్వ విద్వేషాలు రెచ్చగొట్టిన ఫలితంగానే మూకుమ్మడిగా జైశ్రీరాం అంటూ రాళ్లతో కర్రలతో దళిత వాడపై దాడి జరిగిందన్నారు. దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు కోటారి గౌతం,జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పీఏసీఎస్ చైర్మెన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జోగిపేట

అక్సానీపల్లి పీఏసీఎస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండల పరిధి ,లోని డాకూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జోగిపేటలో ఆయన జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు చేపట్టారు. కేక్ కట్ చేయించి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కలాలి పూజా రమేష్ గౌడ్, గ్రామ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సతీష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలం మీర్ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన నవతెలంగాణ రిపోర్టర్ ప్రవీణ్ తండ్రి నీరుడి ఇమ్మయ్య శనివారం మృతి చెందాడు. ఈ విషయాన్ని తెల్సుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ధైర్యాన్ని ఇచ్చారు. ఆయనతోపాటు పార్టీ మండలాధ్యక్షులు రామ్‌సింగ్, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ అంజయ్య సాగర్, ఉపసర్పంచ్ రాజు, నాయకులు లక్ష్మయ్య, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : మీర్ఖాన్‌పేటలో జరిగిన నీరుడు ఇమ్మయ్య అంత్యక్రియల్లో సీపీఐ(ఎం) ఖేడ్ ఏరియా కార్యదర్శి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అతిమేల మాణిక్, నవతెలంగాణ ఉమ్మడి మెదక్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేకల కృష్ణ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబాన్ని పరామర్శించి భరోసానిచ్చారు.



శ్రీ సాయినగర్ కాలనీలో విద్యుత్ సమస్యకు పరిష్కారం



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్‌లోని శ్రీ సాయినగర్ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఏర్పాటు చేసినట్టు కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గతంలో బస్తీ దర్శన్‌లో భాగంగా శ్రీ సాయినగర్ కాలనీలో పర్యటించినప్పుడు కాలనీలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరినట్టు తెలిపారు. దాంతో విద్యుత్ అధికారులతో మాట్లాడి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రస్తుతం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా.. తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో సంప్రదించి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కాలనీ వాసులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శంకర్ యాదవ్, రాజ్ కుమార్, ప్రకాష్, గోవర్ధన్ రెడ్డి, వీరిశెట్టి, అంజయ్య, కుమ్మరి సత్యనారాయణ, లైన్ మెన్ ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి అవకాశాలతో యువత ముందడుగు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

నేటి యువత స్వయం ఉపాధి అవకాశాల వైపు ముందడుగు వేయడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని వైయస్సార్ కాలనీకి చెందిన చక్రపాణి ఏర్పాటు చేసిన ధనలక్ష్మి పిండి గిర్నినీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నేడు యువత తల్లిదండ్రులకు భారం కాకుండా వారి కాళ్లపై వారే నిలబడుతూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. కష్టపడి పని చేస్తూ ఆదాయ మార్గాల వైపు పయనించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య, రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి, మున్సిపల్ నాయకులు రాజు(మాజీ ఎంపీటీసీ), చంద్రారెడ్డి, కాలనీవాసులు భాస్కర్ రెడ్డి, నర్సింహులు, శ్రీను, రామాచారీ, లక్ష్మణ్ రావు, రమేష్, రాజు, అశోక్, సూర్యనారాయణ, నిర్వాహకులు వీరు, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న పొలాలు

ఆందోళనలో సింగూరు కాలువపై ఆధారపడిన రైతులు... పట్టించుకోని మంత్రి

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని సింగూరు కాలువ కింద పిల్ల కాలువల ద్వారా నీరు సక్రమంగా అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీళ్ల అందకపోవడంతో పొలాలన్నీ ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతీయేడు వేల ఎకరాలకు నీటిని వదిలారని.. నాడు పంటలు సంవృద్ధిగా పండాయని.. కానీ నేడు ఆ పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే.. కండ్ల ముందే చేను ఎండిపోతున్నదని కన్నీటి పర్యంతం అవుతున్నారు. స్థానికంగా మంత్రి ఉన్నప్పటికీ తమ గోసను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటిని వదిలి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. లేని యెడల రైతులమంతా ఏకమై కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేప డుతామని హెచ్చరించారు.





భేల్‌లో 53వ జాతీయ భద్రతా వేడుకలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని భేల్ కమ్యూనిటీ సెంటర్‌లో 53వ జాతీయ భద్రతా వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు గృహ భద్రతపై త్రిభాషా వ్యాస రచన పోటీలు, రోడ్డు భద్రత మరియు ఆరోగ్యం పై పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ సేఫ్టీ చైర్మెన్ రాజగోపాల్ రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్, వెంకన్న హాజరై జాతీయ భద్రత పై అందరికీ అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిభ చూపిన మహిళలకు, విద్యార్థులకు జ్ఞాపికలను బహుమతులను అందజేశారు. జాతీయ భద్రత వేడుకలను భేల్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడంపై ప్రభుత్వ అధికారులు భేల్ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భేల్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, విజయ సాగర్,డీజీఎంలు, మేనేజర్లు,మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఎరువుల దుకాణాల్లో సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు నర్సింగ్ రావు బృందం ఆదివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన జిన్నారంలో గల శ్రీనివాస్, కృష్ణులకు సంబంధించిన ఫర్టిలైజర్ దుకాణాలను, అలాగే సోలక్‌పల్లి గ్రామంలో గల ప్రభాకర్ రెడ్డి ఫర్టిలైజర్ షాప్‌తో పాటు మరో ఫర్టిలైజర్ షాపు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సంబంధించిన ఫర్టిలైజర్ షాప్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులకు సంబంధించిన నిల్వలు, రైతాంగానికి సరిపోను ఎరువుల స్టాకు, ఎరువుల దుకాణాల్లో క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులు, ఫర్టిలైజర్ షాప్స్ అనుమతులు, లైసెన్సులు ఇతరత్రా అంశాలపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో జాయింట్ డైరెక్టర్ నర్సింగ్‌రావు వెంట అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, మండల వ్యవసాయ వ్యవసాయ విస్తీర్ణ అధికారి దామోదర్ బృందం పాల్గొన్నారు.

ఈ క్రషర్లు మాకొద్దు మొర్రో..

సేవ్ మాదారం పేరిట క్రషర్లు, క్వారీల ఎదుట గ్రామస్తుల ఆందోళన..



నవతెలంగాణ-జిన్నారం

'ఈ కంకర క్రషర్లు, క్వారీలు మాకొద్దు మొర్రో.. మాదారాన్ని రక్షించండి మహాప్రభో' అంటూ జిన్నారం మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని కంకర క్రషర్ల, క్వారీల వద్ద ఆదివారం మాదారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కంకర క్రషర్లను, క్వారీలను వెంటనే నిలిపివేయాలంటూ డిమాండ్ చేస్తూ పటాన్‌చెరు నియోజకవర్గం టీఎస్ జాక్ అధ్యక్షులు సాయమొల్ల విజయగౌడ్ నేతృత్వంలో సేవ్ మాదారం పేరిట సామూహిక ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవలే రాష్ట్ర మైన్స్ శాఖ అధికారులకు, పీసీబీ, జిల్లా అధికార యంత్రాంగానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేదంటూ వాపోయారు. కంకర క్రషర్లు, క్వారీలు ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్లను నిర్వహిస్తు న్నారని మండిపడ్డారు. నిబంధనను కాలరాస్తూ సహజ వన రులను కొల్లగొట్టడం, దుమ్ము ధూళితో పర్యావరణాన్ని దెబ్బతీయడంతో పాటు ప్రజారోగ్యాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించడం, సహజవనరులను రక్షించడం తో పాటుగా సేవ్ మాదారం పేరిట ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. మాదారం శివారులో నూతన కంకర క్రషర్లు క్వారీలకు అనుమతుల విషయంలో ఇలాంటి ప్రజా సేకరణ లేకుండా వేగవంతంగా కంకర క్రషర్లు క్వారీలు ఏర్పాటు కావడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. మాదారం గ్రామ ప్రజలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని కంకర క్రషర్లు క్వారీలు నిలిపివేయాల్సిందేనని అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయం జరగని పక్షంలో హైకోర్టులో కేసు వేసి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ ధర్నాలో ఎం సుదర్శన్, కే. అంబదాసు, టి రమణ సింగ్, సిహెచ్. గణేష్, కే.వెంకటేశం గౌడ్, చంద్రశేఖర్, రమేష్, శ్రీనివాస్, సంతు, పాండు, సంపత్, నరేష్, ఆనంద్, బాలేష్, చంటి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 19 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి

నవ తెలంగాణ-హవేలీ ఘనపూర్



మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన హవేలి ఘనపూర్ మండల తొగిట మాజీ సర్పంచ్ మంద శ్రీహరి కుమార్తె వివాహానికి ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, ఎమ్మెల్సీతో ఎంపీపీలు శేరి నారాయణరెడ్డి, యమున జయరాం రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాణిక్య రెడ్డి, మాజీ సర్పంచులు మహిపాల్ రెడ్డి, యామి రెడ్డి బిఆర్ఎస్ మండల నాయకులు మేకల సాయిలు, సాప శ్రీనివాస్ కాలేజ్ శ్రీను నాయక్, ప్రభాకర్, సాయగౌడ్, సిద్ధిరామిరెడ్డి గోవింద రెడ్డి, గుండారం కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

నవతెలంగాణ-నార్సింగి



మట్టి, ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అహ్మద్ మోహిఉద్దిన్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం స్టేషన్ పరిధిలోని శేరిపల్లిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను మైనింగ్ అధికారులకు అప్పగించామని వెల్లడించారు. మండలంలో ఎవరికైనా ఇసుక, మట్టి అవసరం ఉంటే మైనింగ్ అధికారుల వద్ద అనుమతులు తీసుకుని తరలించుకోవాలని, లేనియెడల వాల్టా చట్టం క్రింద కేసులు నమోదు చేసి భారీగా జరిమానాలు విధించడం జరుగుతుందని ఎస్సై అహ్మద్ మోహిఉద్దిన్ హెచ్చరించారు.

తిరుమల స్వామి పూర్ణాహుతిలో పాల్గొన్న జెడ్పీటీసీ



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో జరిగే తిరుమల స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల జడ్పిటిసి పంజా విజయ్ కుమార్ పూర్ణాహుతి పూజలో పాల్గొని తిరుమల స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి జెడ్పీటీసీకి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ విజయ్‌మార్ మాట్లాడుతూ మండలంలోని పాడి పంటలను, ప్రజలను చల్లగా చూడాలని ఆ భగవంతున్ని కోరుకున్నానన్నారు. తిరుమల స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. నాయకులు పట్టించుకోకపోవడం వల్లనే ఆలయ అభివృద్ధి చెందలేదన్నారు. ఇప్పటికైనా నాయకులు దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అక్క పల్లి రాంరెడ్డి, చల్మెడ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేపీ రామాయంపేట ఉమ్మడి మండల నాయకులు రాజేంద్రప్రసాద్, బొమ్మన మల్లేశం, రమేష్, మధు, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, కాకి రాజయ్య, జిపి స్వామి పాల్గొన్నారు.

పాంబండలో బోరు వేయించిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండలంలోని పాంబండ గ్రామంలో తన స్వంత డబ్బులతో జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త ఆదివారం మంచినీటి బోరును వేయించారు. త్వరలో జరగనున్న మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలకు విచ్చేయనున్న భక్తులకు మంచినీటి అసౌకర్యం కలగొద్దనే ఉద్దేశంతోనే, యాదవ సంఘం సభ్యుల కోరిక మేరకు జడ్పిటిసి మహేష్ గుప్తా బోరుబావిని వేయించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మహేష్ గుప్త మాట్లాడుతూ ఆధ్యాత్మికత కార్యక్రమాలకు తనవంతు సహకారం తప్పకుండా అందిస్తానన్నారు. అడిగిన వెంటనే కాదనకుండా తన స్వంత డబ్బులతో బోరు వేయించిన జడ్పిటిసి మహేష్ గుప్తను యాదవ సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ తలారి శివులు, మాజీ సర్పంచ్ స్వాతి విష్ణువర్ధన్ రెడ్డి, తూప్రాన్ వీరేశం, మహేష్ యాదవ్, తాటికొండ నరసింహ గౌడ్, నాగరాజు భాస్కర్, మల్లేష్ అంజనేయులు, కృష్ణ అక్కమల్ల మల్లేష్, యాదవ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేగుంటలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల కేంద్రంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏపీవో శ్వేత నిర్వహించారు. ఈ సామాజిక తనిఖీకి మండల ఎంపీపీ మాసుల శ్రీనివాస్‌తో పాటు అధికారులు అడిషనల్ డి ఆర్ డి ఏ విరోజా, హెచ్ ఆర్ మేనేజర్ రాజేందర్, క్వసి రమాకాంత్, అసిస్టెంట్ ఎస్ఆర్పి దేవేందర్, అసిస్టెంట్ డి.వి.ఓ సంపత్‌లు హాజరయ్యారు. మండలంలోని 28 గ్రామపంచాయతీలకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు మొత్తం రూ.44328557, కాగా రికవరీలు 62165, అలాగే మొత్తం పెనాల్టీలు 14,500, ఒక్కొక్క గ్రామపంచాయతీ వారిగా పనులు, పూర్తి అమౌంటు, జాబ్ కార్డులు, పని దినాలు, వీటిపై అధికారులు సామాజిక తనిఖీపై ఆరా తీశారు. అలాగే కరీంనగర్ గ్రామంలో ఎక్సెస్ అమౌంట్ మిస్ అయ్యిందని, అలాగే కొన్ని మాస్టర్లపై ఎంపీడీవో, ఏపీఓల సంతకాలు లేదన్నారు. అలాగే చిన్నచివనూర్ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు నిర్వహించారు. అక్కడ రిజిస్టర్లు పెట్టకపోవడం, అలాగే పాస్ ఆర్డర్లపై అధికారుల సంతకాలు లేవని సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. అలాగే కొన్ని జీపీలలో చిన్న చిన్న లోపాలు ఉండడంతో వాటిని సరిదిద్దుకోవాలని మళ్లీ ఎలాంటి ఫిర్యాదులు కానీ, సమస్యలు ఉండకూడదని సంబంధిత అధికారులకు అడిషనల్ డిఆర్డిఏ విరోజా తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె గడ్డివాము దగ్ధం

నవ తెలంగాణ-రాయపోల్





వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశాత్తు గుడిసె, గడ్డివాములు దగ్ధమైన సంఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చెట్టే దావీద్ తన వ్యవసాయ పొలం వద్ద గుడిసె వేసుకున్నాడు. గుడిసెలో ఇటీవల కొనుగోలు చేసిన రెండు పైపు బెండలు, డ్రిప్పు పైపులు, విద్యుత్ పైపులతో సహా ఇతర వస్తువులన్నీ కాలిపోయాయి. పశువుల మేత కోసం నిలువ చేసి పెట్టుకున్న 100 గడ్డిమోపుల గడ్డివాము కాలి పోయింది. దీంతో 30 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితులు కోరుకుంటున్నారు.

పరీక్షలంటే భయమెందుకు

- ఏకాగ్రతతో చదివితే లక్ష్యాన్ని చేదించవచ్చు
- సమీపిస్తున్న పబ్లిక్ పరీక్షలు
- పుస్తకాలతో కుస్తీపడుతున్న విద్యార్థులు
- ఒత్తిడిని అధిగమించాలంటున్న నిపుణులు

నవతెలంగాణ- మెదక్

విద్యార్థి దశలో అతీ కీలకమైన ఘట్టం పబ్లిక్ పరీక్షలు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఏదైనా కావచ్చు పరీక్షల సమయం వచ్చిందంటే చాలు విద్యార్థుల్లో తెలియని భయం, ఆందోళన మొదలవుతుంది. పరీక్షల్లో తాము చదివిన ప్రశ్నలు వస్తాయో రావో అనే అభద్రతా భావనకు లోనవుతుంటారు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురవుతూ పరీక్షల సమయంలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబు తెలిసినా చదివింది కాస్త మరిచిపోయి తలలు పట్టుకుంటారు. ప్రతి విద్యార్థి నిర్లక్ష్యాన్ని దరిచేరనీయకుండా ఏకాగ్రతతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పబ్లిక్ పరీక్షల వేళ ప్రత్యేక కథనం..

జిల్లాలో 21 మండలాలు, 469 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలలు మొత్తం కలిపి 225 ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి జిల్లాలో 10,300 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందులో బాలురు 5079 ఉండగా, బాలికలు 5221 మంది ఉన్నారు. మార్చి 18 నుండి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఇదే క్రమంలో ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలు నిర్వహించనున్నారు. మెదక్ జిల్లాలో ఫలితాలను మెరుగుపరచాలనే సంకల్పంతో కలెక్టర్ రాజర్షి షా జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలలను ఆకస్మికంగా సందర్శిస్తూ విద్యార్థుల ప్రగతిని, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకొని ఉపాధ్యాయులకు తగు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు

పాఠశాలల్లో, కళాశాలల్లో ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేశారు. ఉత్తమ ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు రాత్రి పగలు తేడాలేకుండా పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఓ వైపు తమ పిల్లలు పబ్లిక్ పరీక్షల్లో పాస్ అవుతారా లేదా అనే ఆలోచనలతో విద్యార్థుల తల్లిదండ్రులు మదనపడుతుండగా, మరోవైపు తమ పాఠశాలకు విద్యార్థులు ఏ స్థాయిలో ర్యాంకులు తీసుకొస్తారోనని ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతూ విద్యార్థుల పై ఒత్తిడి తీసుకొస్తుంటారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాదించాలంటే సరైన ప్రణాళికను ఏర్పాటు చేసుకొని, సబ్జెక్టుల పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి. ఇదే క్రమంలో ఆత్మ విశ్వాసం, సానుకూల దక్పథం తప్పకుండా అవసరం. చిన్నప్పటి నుండి నేర్చుకున్న వ్యతిరేఖ ఆలోచనలే విద్యార్థుల భయానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. చాలా మంది విద్యార్థులు చదివింది గుర్తుకు రావటం లేదని పరీక్షల్లో పాస్ కావడం కష్టమని ముందే భావిస్తుంటారు. దీంతో విద్యార్థులు పై ఒత్తిడి పెరిగి పరీక్ష హాల్‌లోకి వెళ్ళగానే ఏకాగ్రత శాతం తగ్గిపోయి చదివింది మర్చిపోతుంటారు. కాబట్టే పరీక్ష హాల్‌లోకి అడుగుపెట్టగానే కళ్ళు తిరుగుతున్నట్లుగా బావించి భయాన్ని పెంచుకుంటారు. మరికొందరు విద్యార్థులు పరీక్షల గురించి ముందు నుంచే నెగిటివ్‌గా ఆలోచించడం వల్ల అస్వస్థతకు గురవుతుంటారు. తరగతిలో ఎలా ఉంటారో అదేవిధంగా పరీక్ష హాల్‌లోనూ విద్యార్థులు ఉండాలని నిపుణులు చెపుతున్నారు. పరీక్షలకు ముందు నుండే విద్యార్థులు పాజిటివ్ దక్పథంతో ఆలోచించడం వల్ల ఆత్మ విశ్వాసం కలిగి ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలను భాగా రాయగలుగుతారు.

ఏకాగ్రతను పెంచుకోవాలి

ప్రతి రోజు తెల్లవారుజామున 4గంటల నుండి, సాయంత్రం 8 గంటల తర్వాత సుమారు మూడు గంటల పాటు ఏకాగ్రతతో చదివితే గుర్తుండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

- గతంలో టాపర్లుగా నిలిచిన వారిని, మేధావులను ఆదర్శంగా తీసుకొని చదవాలి. నిద్ర మానుకొని రాత్రింభవళ్లు చదవడం వల్ల ఆరోగ్యం క్షీణించే ప్రమాదం ఉంటుంది.
- అలాగే విద్యార్థులు మంచి పౌష్టికాహారాలను తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ భోజనం చేయాలి.
- మాంసాహారానికి దూరంగా ఉండాలి. పండ్లు, పాలు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, కర్జూరం, ద్రాక్ష వంటివి తీసుకోవడం వల్ల మెదడు శక్తి వంతంగా పనిచేస్తుంది.
- రాత్రి వేళలో మేల్కొని చదివే సమయంలో పాలు తాగడం మంచిది. పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు కనీసం ఏడు నుండి ఎనిమిది గంటలు నిద్రపోవాలి. టీవీలు, సెల్‌ఫోన్‌లు, ఆటలకు తప్పనిసరిగా దూరంగా ఉండాలి.
- సిలబస్‌ను బాగాలుగా విభజించుకొని పోటీతత్వంతో చదవుతూ పరీక్షలకు సిద్ధం కావాలి.
- పరీక్షలకు ఎన్ని రోజుల సమయం ఉందనే విషయాన్ని గ్రహించి ఒక్కో సబ్జెక్టులో ఎన్ని పాఠాలు ఉన్నాయనే విషయాన్ని సరిచూసుకోవాలి. ప్రతి రోజు ప్రణాళిక బద్దంగా చదవాలి. దీని వల్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొంది చదివిన విషయాలు సులువుగా గుర్తుంటాయి.

తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి

పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లల పై ప్రత్యేక శ్రద్ద వహించాలి. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇంట్లో టీవీ, సీరియల్స్ చూడటం వంటివి మానుకోవాలి.

- ప్రతి రోజులు క్రమం తప్పకుండా తెల్లవారుజామునే పిల్లలను నిద్ర మేల్కొల్పి చదివించాలి.
- రాత్రి వేళ చదివే సమయంలో నిద్ర రాకుండా ఉండేందుకు పిల్లలకు పాలు, స్నాక్స్ వంటివి అందించాలి.
- తోటి విద్యార్థులతో పోల్చుతూ అవహేళన చేస్తూ పిల్లల మనస్సును బాధ కల్గించకూడదు. తప్పకుండా మంచి మార్కులతో పాస్ అవుతావనే ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తూ పిల్లలను ప్రోత్సహించాలి.
- ఫలితాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను ఆందోళనకు గురి చేయకూడదు.

విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పరీక్ష కేంద్రానికి వెళ్ళేందుకు ఎంత సమయం పడుతుందో తెలుసుకోవాలి. హాల్‌టికెట్స్, పెన్నులను సిద్ధంగా ఉంచుకోవాలి. పరీక్ష సమయానికి ముందుగానే ప్రశాంతంగా కేంద్రాలకు చేరుకోవాలి. ప్రశ్నాపత్రన్ని పూర్తిగా చదవాలి. బాగా వచ్చిన జవాబును ముందుగా రాయాలి. ఇలా చేయడం వల్ల బాగా రాయగలను అనే ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. జవాబు పత్రంలో చేతిరాత ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. ఎలాంటి టెన్షన్‌లకు గురి కాకుండా దైర్యంగా పరీక్షలను వ్రాయాలి. పరీక్ష పూర్తయ్యే సమయానికి మరోసారి చివరిగా ఏఏ ప్రశ్నలకు జవాబులు వ్రాసారు అనే విషయాన్ని సరిచూసుకోవాలి.



పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

పరీక్షలు రాసే విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దు. ఎలాంటి ప్రశ్నలు వచ్చినా తప్పకుండా భాగా రాయగలను అనే భావాలను పెంపొందించుకోవాలి. పరీక్షల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో తోటి మిత్రులతో కంబైన్డ్ స్టడీస్ చేయకూడదు. ఒంటరిగానే చదవాలి, చదివిన వాటిని అర్థం చేసుకోని పేపర్ పై రాసుకోవాలి. తప్పని సరిగా 7 నుండి 8 గంటల సమయం నిద్రపోవాలి. తల్లిదండ్రులు పిల్లలను అభద్రతా భావానికి గురిచేయకుండా తప్పకుండా పాస్ అవుతావని ప్రోత్సహించాలి. అలాగే మాంసాహారం కాకుండా మంచి పౌష్టికాహారాన్ని అందించాలి. పరీక్ష కేంద్రంలో ప్రశ్నా పత్రం చూసిన వెంటనే సులభంగా ఉన్నవాటిని గుర్తించి రాసి, కఠినంగా ఉన్నవాటి గురించి ఆలోచించి రాయాలి. పరీక్షలు పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్‌లో మాట్లాడటం తగ్గించాలి. వీడియో గేమ్స్, క్రికెట్ తదితర ఆటలను మానుకోవాలి. ఒకవేల మార్కులు తక్కువ వచ్చి ఫేయిల్ అయినా నిరాశ చెందకుండా ఆత్మ విశ్వాసంతో మళ్ళీ పరీక్షలు రాసేందుకు సిద్ధపడాలి.

రమేష్‌బాబు, సైకాలజిస్ట్, డైట్ కళాశాల ప్రిన్సిపల్, మెదక్.

ఇష్టపడి చదవాలి

విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలి, ఒత్తిడితో కాకుండా ఇష్టపడి చదవాలి. ప్రభుత్వ విద్యాలయాల్లో ఉన్నతమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. అనుభవమైన ఉపాధ్యాయులతో పాటు అన్ని రకాల పుస్తకాలు, స్నాక్స్, స్టడీ మెటీరియల్స్ విద్యార్థులకు అందిస్తున్నాము. హాస్టల్‌లో ఉండే విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ హావర్స్, ప్రత్యేక ట్యూటర్స్ ను నియమించి ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్నాము. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థుల ప్రగతిని, సౌకర్యాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అలాగే ఉపాధ్యాయులకు తగు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.



- రాజర్షి షా, కలెక్టర్, మెదక్.

శత శాతం ఫలితాలు లక్ష్యంగా కృషి:

కలెక్టర్ ఆదేశానుసారం పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. విద్యార్థులను ఎబిసిడి గ్రూపులుగా విభజించి ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. అన్ని సబ్జెక్ట్ లలో మంచి మార్కులు వచ్చేలా నిపుణులతో ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్నాము. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నాము. పరీక్షల వేళ విద్యార్థులు సమయాన్ని వృదా చేయకుండా చదవాలి. టీవీ, ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి.

- రాధాకిషన్, డీఈఓ, మెదక్

వైభవంగా అమ్మవారికి లక్ష పుష్పార్చన

ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో అన్నదానం

నవ తెలంగాణ-నర్సాపూర్

అత్యంత శక్తి పీఠాలలో ఒకటైన శివ్వంపేట శ్రీ బగలాముఖి శక్తిపీఠంలో అమ్మవారి ఉపాసకులు శాస్తుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. గూడూరు శ్రీ గురు పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, పగలాముఖి శక్తిపీఠం ట్రస్ట్ సభ్యులు, హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్- రమాదేవి దంపతుల సంపూర్ణ సహకారాలతో, అమ్మవారికి మొక్కు చెల్లించడం కోసం ఆదివారం బగలాముఖి అమ్మవారికి లక్ష పుష్పార్చనలు, హరిదార్చన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి భక్తులు శివకుమార్ గౌడ్ బంధుమిత్రులతో నిర్వహించిన లక్ష పుష్పార్చన కార్యక్రమంలో 100 మంది దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి నిర్వహించిన లక్ష పుష్పాలతో లక్ష నామార్చనలు, పుష్పార్చన, మంత్రపుష్పం, మంగళహారతి కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ అమ్మవారి భక్తులందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలనే సదుద్దేశంతో అమ్మవారికి లక్ష నామార్చనలు, లక్ష పుష్పార్చనలు, హరిద్వార్చన కార్యక్రమాన్ని ఒకేరోజు నిర్వహించి మొక్కులు చెల్లించుకోవడం జరిగినదన్నారు.

లక్షణామార్చనలో పాల్గొన్న ప్రముఖులు

ప్రసాద్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ గురు పీఠం ఫౌండర్ చైర్మన్ శివకుమార్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన బగలాముఖి అమ్మవారికి లక్షణామార్చనలు లక్ష పుష్పార్చనలు, హరిద్రార్చన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శక్తిపీఠం స్థలదాత పబ్బ రమేష్ గుప్త, షిరిడి సాయి ముఖ్య భక్తులు విజయ్ కుమార్, వనజ, బగలాముఖి ట్రస్టు సభ్యులు, జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్త, దర్శనం వెంకన్న శర్మ, సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ డిసిపి వాసు శ్రీనివాస్,ప్రసాద్ ట్రస్ట్ సభ్యులు సూర్యం కుమార్ గౌడ్, శక్తిపీఠం ప్రధాన అర్చకులు సంతోష్ కుమార్ శర్మ చరణ్ శర్మ అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో అన్నదానం

లక్ష నామార్చనలు లక్ష పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్న అమ్మవారి భక్తులందరికీ ఇస్కాన్ హరే రామ హరే కృష్ణ టెంపుల్ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇస్కాన్ టెంపుల్ సభ్యులందరికీ బగలాముఖి ట్రస్ట్ తరఫున అమ్మవారి ఉపాసకులు వెంకటేశ్వర శర్మ సభ్యులు శివకుమార్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇథనాల్ పై పోరాటాలు పలించేనా..?

- గ్రామస్తుల పోరాట సాకుతో రాజకీయ పార్టీల శ్రేణుల ఎత్తుగడలు
- పరిశ్రమ యాజమాన్యంతో లాభియింగుకు సన్నద్ధమవుతున్నారనే ఆరోపణలు

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుగ్గీల్ల గ్రామ శివారులో నిర్వహించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ, పోతారం గ్రామ శివారులో తలపెట్టిన ఇథనాల్ ఇంధన నిల్వ గోదాం నిర్మాణాలపై రోజురోజుకు వివాదం ముదురుతోంది. గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ పనుల కోసం యాజమాన్యం చేపడుతున్న నిర్మాణ పనులను అడ్డుకుంటూ గుగ్గీల్ల, తిమ్మాయిపల్లి, నర్సింహుల పల్లి గ్రామస్తులు తమదైన శైలిలో పరిశ్రమ నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారు. ఇటీవల ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులను గుగ్గీల్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించడంతో పోలీస్ శాఖాధికారుల భద్రతతో వెళ్లిపోయారు. నర్సింహుల పల్లి గ్రామస్తులు ఇథనాల్ ఇంధన నిల్వ గోదాం నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని తహసిల్దారుకు వినతిపత్రం అందజేశారు. మా గ్రామాల భవిష్యత్తును హరించే ఇథనాల్ పరిశ్రమ అనుమతులను ప్రభుత్వం బేషరుతుగా రద్దు చేయాలని అయా గ్రామాల గ్రామస్తులు బహిరంగంగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై తలెత్తిన వివాదానికి ప్రభుత్వం తెరదించాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గ్రామస్తుల పోరాటాలు పలించేనా..?

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం వల్ల తమ భవిష్యత్తు అందకారమవుతుందనే సదుద్దేశ్యంతో గుగ్గీల్ల, తిమ్మాయి పల్లి, నర్సింహుల పల్లి గ్రామస్తులు పరిశ్రమ నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నారు. గ్రామస్తుల పోరాటాలను అసరాగా చేసుకుని పలువురు అయా గ్రామాల రాజకీయ పార్టీల శ్రేణులు పరిశ్రమ యాజమాన్యంతో లాభియింగుకు పాల్పడి ఆర్థికంగా లబ్ది చేకూర్చుకోవాలనే ఎత్తుగడలు పన్నుతూ సన్నద్ధమవుతున్నట్టు పలువురు గుగ్గీల్ల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇథనాల్ పరిశ్రమపై అయా గ్రామాల ప్రజల పోరాటం పలించేనా అనే సందిగ్ధం నెలకొంది.

పరిశ్రమ మాకొద్దు

-కుంట రాజు, రైతు నర్సింహుల పల్లి.

ఇథనాల్ పరిశ్రమ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పరిశ్రమలతో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందని..స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తుందనే ప్రజాప్రతినిధులు, అధికారుల వాఖ్యలు పూర్తిగా అర్థరహితమైనవి. ఇథనాల్ పరిశ్రమ మాకొద్దు. పరిశ్రమ నిర్మాణ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలి.



ఎన్ని కేసులైనా ఎదుర్కొంటాం

-కుసుంబ సంపత్ రావు,నర్సింహుల పల్లి.

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం వల్ల మా గ్రామాల ప్రజల భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారనుంది. ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటాయి. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు అనుసరించవు. ఇథనాల్ పరిశ్రమపై పోరాటాలు చేస్తాం. ప్రభుత్వం ఎన్ని కేసులు నమోదు చేసినా ఎదుర్కొంటాం. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలి.

హల్దీ వాగులోకి మల్లన్న సాగర్ జలాలు

నవతెలంగాణ-వెల్దుర్తి

రైతులను దృష్టిలో పెట్టుకొని నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మా రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అధికార పక్షాన్ని హల్దీ వాగులోనికి మల్లన్న సాగర్ నుంచి జలాలను విడుదల చేయాలని కోరారు. తదనంతరం మల్లన్న సాగర్ జలాలను హల్దీ వాగులోనికి ఆదివారం విడుదల చేసినట్లు బీఆర్ఎస్ శ్రేణులు తెలిపాయి. ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని సాగు తాగుకు కొరత ఏర్పడకుండా మల్లన్న సాగర్ జలాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు.

దొంగలున్నారు జాగ్రత్త !

నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామాల్లోనీ సంతల్లో, ప్రజలు ఎక్కువగా గుమిగూడిన ప్రాంతాల్లో ప్రజల మధ్య దొంగలు బీభత్సంగా తిరుగుతున్నారు. సిద్దిపేట జిల్లాలో పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతున్నారు. సిద్దిపేట, దుబ్బాక, మిరుదొడ్డితో పాటు పలు మండలాల్లో ఇప్పటికీ వరుసగా దొంగతనాలు జరుగుతున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. సంత జరుగుతున్న సమయంలో ఎక్కువగా మొబైల్ ఫోన్లు, ఆభరణాలను దొంగిలిస్తూ దొంగలు బీభత్సంగా తిరుగుతున్నారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్, మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో ఇళ్లల్లో చోరీ జరిగిన సంగతి తెలిసిందే. అదే మాదిరిగా



అక్కడక్కడ దొంగలు ఉన్నట్టుగా సమాచారం వస్తుంది. మండలంలోని అల్వాల, చెప్యాల, మిరుదొడ్డి గ్రామాల్లో ప్రతి వారం సంత జరుగుతూనే ఉంటుంది. ఈ సంతల్లో సెల్ఫోన్లు తరచుగా దొంగిలిస్తూ ఉన్నారు. గ్రామాల్లో అక్కడక్కడ సీసీ కెమెరాలు ఉంటే ఆ దొంగలను



పట్టుకోవడానికి సులువుగా ఉండే అవకాశం ఉంది. కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్టుగా తెలుస్తుంది. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో కూడా దొంగతనాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయం.

అనుమానితులుగా కనబడితే సమాచారమివ్వాలి

ఎస్సై పరశురాం



గ్రామాల్లో ఎవరైనా అనుమానితులుగా కనబడితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. ప్రజలు ఎవరైనా దూర ప్రాంతాలకు వెళ్లిన వారు ఆభరణాలు డబ్బులు జాగ్రత్తపరుచుకొని వెళ్లాలి. లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే వారిపై నిఘా పెట్టడం జరుగుతుంది. శాంతి భద్రతకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

వేల్పుల దేవయ్య సేవలు మరువలేనివి



నవతెలంగాణ-మద్దూరు

సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు వేల్పుల దేవయ్య సేవలు మరువలేనివని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అన్నారు. వేల్పుల దేవయ్య తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా మండలంలోని వల్లంపట్ల గ్రామంలో సిపిఎం మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి కుటుంబ సభ్యులతో కలిసి వేల్పుల దేవయ్య స్థూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం యాదగిరి దేవయ్య చిన్నతనం నుంచి కమ్యూనిస్టు భావాలతో ఉండి సిపిఎం పార్టీలో సభ్యునిగా చేరి సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట ప్రాంతంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. నిలువనీడ లేనోళ్లకు నీడ కావాలని గుడిసెలేసి గుడిసెల పోరాటం నిర్వహించి వేలాది మందికి ఇండ్లస్థలాలు ఇప్పించిన గొప్ప నాయకుడన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ముందుకు తీసుకపోతామన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల ప్రభాకర్, వేల్పుల ప్రకాశం, స్వర్ణలత, కొండ యుగంధర్, చింతల నర్సిరెడ్డి వేల్పుల లలిత తదితరులు పాల్గొన్నారు.

వధూ వరులను ఆశీర్వదించిన హరీశ్ రావు



నవ తెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పలు వివాహాలకు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. రెడ్డి సంక్షేమ భవన్‌లో జరిగిన సీనియర్ జర్నలిస్ట్ రాజిరెడ్డి కూతురి వివాహానికి, విఎస్ఎస్ కన్వేన్షన్ హాల్‌లో జరిగిన మున్సిపల్ కౌన్సిలర్ పాతూరి శ్రీనివాస్ రెడ్డి కుమారుని వివాహానికి, బైరి అంజయ్య గార్డెన్‌లో జరిగిన నంగునూర్ మండలం రాంపూర్ ఎంపీటీసీ నితిన్ వివాహానికి, పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేకపిల్లలు మృతి



నవతెలంగాణ-మద్దూరు

కుక్కల దాడిలో మేకపిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు తుప్పతి ఎల్లయ్య, మల్లవ్వ తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే మేకలను మేపుకొని వచ్చి దొడ్లోకి తోలి ఇంటికి వెళ్లి తెల్లారి వచ్చేసరికి. మేక పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందినట్లు వారు తెలిపారు. కుక్కల దాడిలో 7 మేక పిల్లలను కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అందే అశోక్ ప్రభుత్వాన్ని కోరారు.

విద్యారంగంపై చిన్నచూపు తగదు

- సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి
- తపస్ రాష్ట్ర కార్యదర్శి సింగోజి జనార్ధన్



నవ తెలంగాణ-సిద్దిపేట

నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎలాంటి కృషి చేయలేదని, తక్షణమే ఆ దిశగా ప్రయత్నం చేసి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగోజి జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక శిశుమందిర్‌లో జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన తపస్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. 317 బాధితులు ప్రతిరోజు నరకయాతన అనుభవిస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పినా, ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. వచ్చే నెల నుంచి పదవి విరమణ పొందుతున్న ఉపాధ్యాయుల స్థానంలో వారిని స్థానిక జిల్లాలకు తీసుకురావడానికి వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ఉద్యోగ జీవితంలో ఒక్క పదోన్నతి కూడా లేక పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి ఉపాధ్యాయులను మనోవేదనకు గురిచేస్తుందని, వెంటనే బదిలీలు, పదోన్నతులు కల్పనకు కృషి చేసి, ఉపాధ్యాయులు సంతృప్తితో పదవీ విరమణ చేసే పరిస్థితులను కల్పించాలని కోరారు. నెల రోజుల్లోనే పిఆర్సి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి స్పందన లేదన్నారు. గత రెండు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న మూడు డిఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోడ్ కంటే ముందే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల కోడ్ పేరుతో సమస్యలను దాటవేయడం తగదన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయకపోతే ఉద్యోగ ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికావాల్సిన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుముల మురళి, జిల్లా బాధ్యులు, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రానికి చెందిన చౌడుచెర్ల వెంకట్రామిరెడ్డి బీజేపీ నంగునూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి నియమాక పత్రాన్ని అందజేశారు. ఆదివారం నంగునూరుకి చెందిన బీజేపీ నాయకులు వెంకట్రామిరెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తుపాకుల నరేష్, అమిరి శెట్టి ప్రవీణ్ కుమార్, జీడిపల్లి రజనీకర్ రెడ్డి, వల్లపు రెడ్డి వేణు, సతీష్, పరమేశ్వర్, తిరుపతి రెడ్డి, లవన్ కుమార్, జీవన్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి నిధులు మంజూరు

టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్



నవ తెలంగాణ- దౌల్తాబాద్

మండల పరిధిలోని గ్రామాలల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.45 లక్షలు ఉపాధి హామీ నిధులు, జీపీ బిల్డింగ్స్, కమ్యూనిటీ హాళ్ల పెండిగ్ పనుల నిమిత్తం రూ.44 లక్షలు ఎస్ఎఫ్ నిధులు మంజూరు అయ్యాయని టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి పంచమి గణేష్ తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాల కోసం పరిపాలనా అనుమతిని పొంది ప్రత్యేక అభివృద్ధి నిధి పథకం కింద మండల పరిధిలో ఆరు అభివృద్ధి పనులను చేపట్టేందుకు రూ.44 లక్షలు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. మొదటి ప్రాధాన్యతగా ఎన్నో ఏళ్లుగా కోనాపూర్‌లో పెండింగ్ లో ఉన్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం రూ.7 లక్షలు, బీసి కమ్యూనిటీకి హాల్ కోసం రూ.5 లక్షలు, దౌల్తాబాద్ మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం రూ.7 లక్షలు, ముత్యంపేట గ్రామంలో అసంపూర్తి ఉన్న గ్రామ పంచాయతీ భవనం కోసం రూ.5 లక్షలు, గొడుగుపల్లి గ్రామంలో రెడ్డి సంఘం భవనం కోసం రూ.10 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలసాహిత్యం ఎంతో అవసరం

బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం



నవ తెలంగాణ-సిద్దిపేట

నేటి సమాజానికి బాలసాహిత్యం ఎంతో అవసరమని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం అన్నారు. ప్రతినెల మన బాల సాహిత్యం కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చందమామ, బాలమిత్ర, బుజ్జాయిలాంటి మాసపత్రికల ద్వారా నీతి పరమైన కథలు సమాజానికి చేరేవన్నారు. నేడు అలాంటి పత్రికలు కనుమరుగైనా పత్రికలలో పిల్లల శీర్షికలతో కథలు గేయాలు, బొమ్మల రూపంలో అందుతున్నాయన్నారు. సామాజిక మాధ్యమాలలో సైతం బాల సాహిత్యం విరివిగా రావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పాఠశాల విద్యార్థులు రాస్తున్న బాలసాహిత్య రచనలకు పలు అవార్డులు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా బాలసాహిత్యం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సిద్దిపేట జిల్లా బాలసాహిత్య రచయితల కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బాలసాహిత్య రచయితలు బస్వరాజ్ కుమార్, కోణం పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల నూతన కమిటీ ఎంపిక



నవ తెలంగాణ-గజ్వేల్

ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో వివిధ గ్రామాల నాయకులు పాల్గొనడం జరిగింది. ఆదివారం నూతన కమిటీని గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఓ సమావేశం మందిరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గజ్వేల్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల రవీందర్, ఉపాధ్యక్షుడుగా స్వామి, కోశాధికారిగా ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా కర్ణాకర్, సహాయ కార్యదర్శిగా నవీన్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, రాజు, కర్ణాకర్ తదితరులు నూతన కమిటీలో ఉన్నారు.

సమాజాన్ని మార్చేదే కవిత్వం

సిరసం అధ్యక్షులు అమ్మన చంద్రారెడ్డి



నవ తెలంగాణ-సిద్దిపేట

సమాజాన్ని మార్చేదే కవిత్వమని సిరసం అధ్యక్షులు అమ్మన చంద్రారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం సిద్ధిపేట జిల్లా రచయితల సంఘం(సిరసం), శ్రీ వాణీ సాహిత్య పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో పెందోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన కవిసమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పు, చైతన్యం, తీసుక రావడానికి సాహిత్యం ఒక బహుళ ప్రయోజనం గల సాధనమన్నారు. కవులు సామాజిక స్పృహ గల్గిన కవిత్వం సృజిస్తేనే సమాజం మంచి దిశగా మారుతుందన్నారు. కవుల, రచయితల నిరంతర పఠనం తోడ్పాటుతో ఇది సాధ్యమౌతుందన్నారు. కవి సమ్మేళన కార్యక్రమంలో సుమారు 30 మంది కవులు మాతృభాషపై తమ కవితలను వినిపించి, ఆద్యంతం అలరించారు. వారిని నిర్వాహకులు సత్కరించారు.

కులగణన తీర్మానం హర్షణీయం



నవతెలంగాణ-తొగుట

కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేయడం హర్షణీయమని బీఎస్ఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కృష్ణ గౌడ్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేయడం అభినందనీయమని తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కులగణన చేయక పోవడం దురదృష్టకరమన్నారు. బీసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టడంతో బీసీలకు ఊరట కలిగిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి వెంటనే కుల గణన చేసి బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



నవతెలంగాణ-గజ్వేల్ : కుల గణనతో సామాజిక న్యాయం బలహీన వర్గాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల గణన కార్య క్రమాన్ని కాంగ్రెస్ తీసుకుందని దీని ద్వారా అన్ని సామాజిక వర్గాలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వం ఒకరోజు సర్వే చేపట్టినా, అది కాగితాలకే పరిమితమైందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కులగణన సమర్థ వంతంగా నిర్వహిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనాలు బలహీనులకు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ శాసనసభలో కుల గణనను తీర్మానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జనాభా ప్రతిపాదికన బలహీన వర్గాలకు అన్ని రంగాలలో తగిన ప్రాధాన్యత లభించనున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనపై మంత్రివర్గంలో తీర్మానం చేసి శాసనసభలో ప్రవేశపెట్టిందని, వెంటనే సభ ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయం అభిప్రాయపడ్డారు. రాజ్యాధికారంలో బడుగు బలహీనులకు భవిష్యత్తు కాలంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో మరింత ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కులగణన పూర్తయితే అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

పొదుపు చేయటం అలవర్చుకోవాలి



నవతెలంగాణ-నంగునూరు

నెలలో కనీసం ఒక రోజు సంపాదనను పొదుపు చేయటం వలన వృద్ధాప్యంలో ఇతరులపై ఆధారపడకుండా ఉండగలుగుతామని రాజగోపాల్‌పేట పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు కడారి తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం నంగునూరు పురుషుల పొదుపు సంఘం 21వ మహాసభ వార్షిక సమావేశం సంఘం అధ్యక్షుడు రాజపేట గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఒక క్రమ పద్ధతిలో నియమిత పొదుపు చేసుకునే అవకాశాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పురుషుల సంఘంలో సభ్యుడిగా నమోదైన వారు సామూహిక బీమా నిధి పథకంలో చేరితే ఎలాంటి మరణం సంభవించిన నామినీకి రూ.45 వేల నగదును సహవికాస సంస్థ ద్వారా అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు ఆరె శ్రీనివాస్ గౌడ్, పాలక వర్గసభ్యులు రాగుల మల్లేశం, గోనె సత్యనారాయణ, దేవులపల్లి నర్సింగరావు, పులి రవి, కోల రాములు, వల్లపురెడ్డి రాంచంద్రారెడ్డి, అనరాజు నాగరాజు, గణకుడు కోల రాజశేఖర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం ప్రాంతం పరిశీలించిన ఏసీపీ బాలాజీ





నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్‌లో శ్రీ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల కోసం సిద్ధమవుతున్న శివాజీ విగ్రహం ప్రాంతం, శ్రీ ఉమా మహేశ్వర ఆలయం పరిసరాలను గజ్వేల్ ఏసీపీ బాలాజీ ఆదివారం పరిశీలించారు. సిఐ సైదాతో కలసి పరిసర ప్రాంతాలను పరివేక్షించారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ శివాజీ జయంతి వేడుకలు శాంతి యుతంగా నిర్వహించు కోవాలన్నారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. కులమతాలకు అతీతంగా జయంతిని నిర్వహించుకుంటే సంతోషకరమన్నారు. మతపరమైన తేడాలు తీసుకువచ్చి శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హల్ది వాగులోకి నీళ్ల విడుదల పట్ల రైతుల హర్షం





నవ తెలంగాణ-గజ్వేల్

హల్ది వాగులోకి నీళ్లను విడుదల చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. సకాలంలో పంటలకు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు . మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి శాసనమండలిలో ఈ అంశాన్ని లేవనెత్తడంతో స్పందించిన ప్రభుత్వం శనివారం సాయంత్రం వర్గల్ మండలం నవోదయ విద్యాలయం సమీపంలో ఉన్న కెనాల్ వద్ద నీటిని విడుదల చేశారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాలతో సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు సాగునీరు అందించారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-మద్దూరు

అసెంబ్లీ సమావేశాల్లో బీసీ కుల గణన బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, నియోజకవర్గ ఇంఛార్జి జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షులు చెట్యూరి కమలాకర్ యాదవ్, బిసి సెల్ మండల అధ్యక్షుడు సుందరగిరి సత్యనారాయణ గౌడ్‌ల ఆధ్వర్యంలో మద్దూరు, దూల్మిట్ట, మండల కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బిసి కుల గణన చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టినందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సలాక్‌పూర్ ఎంపిటిసి ఇర్రి రాజేశ్వర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, నాయకులు దాసరి పద్మా రెడ్డి, బూరుగు రాజు, గుండెగోని మల్లేశం, నీరటి కిషోర్, చెట్యూరి వెంకటేశ్వర్లు, బందరం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు



నవ తెలంగాణ-రాయపోల్

సిద్దిపేట పోలీసు కమీషనర్ ఆదేశానుసారం రాయపోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సయ్యద్ నగర్ గ్రామంలో శనివారం రాత్రి పోలీస్ కళా బృందం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. మంత్రాలు, మూఢనమ్మకాలపై, మద్యం తాగడం వల్ల కలిగే నష్టాలు, కుటుంబ కలహాలు గురించి, జూదం ఆడుట వలన కుటుంబలో జరుగుతున్న పరిణామాలను, వరకట్నం వలన జరుగుతున్న సంఘటనలు గురించి వివరించారు.ఈ మధ్య జరుగుతున్న ఆత్మహత్యలు గురించి, వృద్ధులైన తల్లిదండ్రులను సంరక్షణ, డ్రైవింగ్ లైసెన్స్, షీ టీమ్స్ గురించి కళాబృందం సభ్యులు పాటలు, నాటకం రూపంలో ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించి ప్రజలను చైతన్య పరిచారు.ఈ సందర్భంగా తొగుట సిఐ లతీఫ్ మాట్లాడుతూ ఇటీవల చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే బీహార్ ఇతర రాష్ట్రాల నుంచి గ్యాంగులు వచ్చాయని సోషల్ మీడియాలో షికార్లు, పుకార్లు చేస్తున్నాయని, అలాంటి వ్యక్తులు ఎవరు జిల్లాలో ప్రవేశించలేదన్నారు. అసత్య ప్రచారాన్ని నమ్మకూడదన్నారు. మంత్రాలు, ముడనమ్మకాలు నమ్మవద్దని వాటి గురించి స్వామీజీల దగ్గరకు బాబాల దగ్గరకు తిరిగి డబ్బులు ఖర్చు చేసి అప్పులపాలు కావద్దన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. నేను సైతం అనే కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింతుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి పోలీసులకు సహకరించాలన్నారు. పరిచయంలేని వ్యక్తులకు ఫోన్ నెంబరు,ఆధార్ నెంబర్లు, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు చెప్పవద్దని తెలిపారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే 100 కాల్ చేయాలని, 8712667100 వాట్సప్ మెసేజ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రఘుపతి, కళాబృందం సభ్యులు బాలు నర్స్, రాజు,రవిందర్ రెడ్డి,తిరుమల, వార్డు సభ్యులు పోలీస్ సిబ్బంది , గ్రామ పెద్దలు,అధిక సంఖ్యలో ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

కోమటి బండ గ్రామంలో పిరమిడ్ క్షేత్ర ఆరో వార్షికోత్సవం



నవ తెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామంలో శ్రీ పంచ పాండవ పిరమిడ్ క్షేత్ర ఆరో వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి విచ్చేసి జ్యోతి వెలిగించారు యోగాసనాల ద్వారా ధ్యానం ద్వారా మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఇది శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. క్రమం తప్పకుండా యోగా ధ్యానం చేస్తే ఒత్తిడి దరిచేరదన్నారు విద్యార్థులకు ఏకాగ్రత ఆత్మవిశ్వాసం లభిస్తుందన్నారు. పిరమిడ్ ట్రస్టు నిర్వాహకులను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలను గ్రామస్థాయిలో అందరికీ తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎంసీ రాజమౌళి, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, ట్రస్టు నిర్వాహకులు పి నర్సింలు, బాల్ రెడ్డి, రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి, వేణు, ప్రశాంత్, నర్సింగరావు, బాలు, బ్రహ్మచారి, నిమ్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబానికి సంతాపం



నవ తెలంగాణ-మిరుదొడ్డి

సివిల్ కాంట్రాక్టు రమేష్ సతీమణి మరణం తీరనిలోటని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సిద్దిపేట జిల్లాలో రమేష్ సతీమణి అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి రమేశ్‌కు మనోధైర్యాన్ని కల్పించారు. రమేశ్‌ను పరామర్శించిన వారిలో బొమ్మారి నరేందర్ పలువురు ఉన్నారు.